RNI:TS-28-0030298

తెలంగాణ డైలీ న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com

సంపుటి : 01 సంచిక : 280 ఆదివారం, నవంబర్ 01, 2026 , పేజీలు - 06 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

తెలంగాణలో బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధమా?

హైదరాబాద్, అక్టోబరు 31 :

తెలంగాణలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలకు వెళ్తే బీజేపీ ఎంపీలు, ఎమ్మెలేలు రాజీనామా చేసేందుకు సిద్ధమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధమైతే తాను, తమ పార్టీ కేంద్ర నాయకత్వాన్ని ఒప్పిస్తామని స్పష్టం చేశారు. ఈనాటి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియతోనే దేశంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయాందా..? అని ప్రశ్నించారు. తమిళనాడులో 60 ఏళ్ల నుంచే కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోయిందని ప్రస్తావించారు. (శనివారం) హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 2004లో చనిపోతే ఆయన ఓటు ఇంకా ఉందని, తొలగించాలా? వద్దా అని ప్రశ్నించారు. ఈ దేశం కాని వాళ్లు అక్రమంగా వలస వచ్చి ఓటర్‌గా నమోదు చేసుకుని ఈ దేశ రాజకీయాలను శాసిస్తామంటే ఊరుకోవాలా అని ధ్వజమెత్తారు.



'ఎలాంటి సాయానికైనా సిద్ధం'

ఏపీ మంత్రికి తెలంగాణ డిప్యూటీ సీఎం ఫోన్



హైదరాబాద్ : మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేశారు. ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఉపముఖ్య మంత్రికి మంత్రి గొట్టిపాటి రవి వివరించారు. సిబ్బంది, సామాగ్రిని కొరత ఉంటే తెలియజేయాలని భట్టి కోరారు. తెలంగాణ నుంచి ఎలాంటి సాయమైనా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో 1,100 మందికి పైగా తెలంగాణ విద్యుత్ సిబ్బంది పని చేస్తున్నారని ఏపీ మంత్రి తెలిపారు. ఏపీ డిస్కంలకు చెందిన 4,400 మంది సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో ఉన్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

'దిల్లీ మార్చ్'కు రాహుల్ పిలుపు

అనుమతి లేదన్న పోలీసులు

- దేశ రాజధానిలో రాజకీయ వేడి!
- దిల్లీలోని కన్నాట్ ప్లేస్
- మింటో రోడ్ జంక్షన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు ఇండి కూటమి తలపెట్టనున్న మార్చ్‌కు అనుమతి లేదని పోలీసులు చెప్పారు.



న్యూ ఢిల్లీ :నవంబర్ 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి తలపెట్టనున్న భారీ ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు, పౌరులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని అన్నారు. శనివారం తన 'ఎక్స్'? ఖాతాలో ర్యాలీకి సంబంధించిన వివరాలను ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు మింటో రోడ్- కన్నాట్ ప్లేస్ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే మార్చ్, రామ్‌లీలా మైదానం వరకు సాగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల కమిషన్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న తీరుపైనే ఈ నిరసన చేపడుతున్నట్లు రాహుల్? పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు ప్రజలు దిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

తెలంగాణలో క్రాప్ హాలిడేపై

మంత్రి తుమ్మల క్లారిటీ

రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలి.



హైదరాబాద్, అక్టోబరు 31 : రాష్ట్రంలో క్రాప్ హాలిడేపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని స్పష్టం చేశారు. (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. క్రాప్ హాలిడేపై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న ప్రచారం అవాస్తవమని.. రైతులు ఈ విషయాన్ని నమ్మొద్దని అన్నారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్త విపత్తు అని.. ఈ విషయంలో ముందస్తు జాగ్రత్తలను తాము తీసుకుంటున్నామని తెలిపారు. ఆరు నెలలుగా రైతన్నలకు ఎల్‌నినోపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి, సమీకృత పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు.ప్రతి వారం వాతావరణం, వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను అన్నదాతలకు చేరవేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. రైతులకు సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో 365 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించి, రైతన్నలకు అండగా తమ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాన్నామని చెప్పారు. అన్నదాతలకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తోందని తెలిపారు. రైతన్నలను నష్టాల నుంచి కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

హైదరాబాద్‌లో నవంబర్ 1 నుంచి గ్రీన్ ట్యాంకర్ల సేవలు ప్రారంభం



హైదరాబాద్, అక్టోబరు 31 : నవంబర్ ఒకటో తేదీ నుంచి హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్ల సేవలు ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రకటించారు. తాగునీరు అవసరం లేని పనులకు శుద్ధి చేసిన నీటినే వాడాలని సూచించారు. (శనివారం) రాష్ట్ర సచివాలయంలో హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాపై సీఎస్ సంజయ్ జాజు సమీక్షా సమావేశం నిర్వహించారు.

అఖండ భారత నిర్మాత, జాతి ఉక్కు మనిషి

న్యూ ఢిల్లీ :ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఘనంగా నివాళి అర్పించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న పటేల్ భారీ విగ్రహం 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' వద్ద ప్రధాని పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రతకు, భారతజాతి నిర్మాణానికి ఆయన చేసిన సేవలను మోదీ కొనియాడారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు ఇతర ప్రముఖులు పటేల్‌కు పుష్పాంజలి ఘటించారు.అఖండ భారత్ రూపశిల్పి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢమైన దేశ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. దేశ సేవలో భాగంగా పటేల్ చేసిన త్యాగం, అంకితభావం, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి గొప్ప ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మోదీ పోస్ట్ చేశారు."సర్దార్ వల్లభభా య్ పటేల్ జయంతి సందర్భంగా, అఖండ భారత నిర్మాత, జాతి ఉక్కు మనిషికి హృదయపూర్వక వందనాలు. బలమైన భారతదేశ నిర్మాణానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. దేశ సేవలో ఆయన చేసిన త్యాగం, అంకితభావం ఆత్మనిర్భర భారతదేశ నిర్మాణానికి స్ఫూర్తిగా నిలుస్తాయి."

– ప్రధాని మోదీఆధునిక భారత రూపశిల్పి: రాష్ట్రపతి ముర్మురాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులర్పించారు. రాష్ట్రపతి భవన్‌లోని గంతంత్ర మండపంలో పటేల్? చిత్రపటానికి పూలమాల వేశారు. స్వాతంత్ర్య సమరంలో యోధుడిగా, ఆధునిక భారతదేశ ప్రధాన రూపశిల్పిగా ఆయన సేవలను కొడియాడారు.



ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ తాగు నీటి ఏర్పాట్లకు ప్రత్యేక నిధులు



హైదరాబాద్, అక్టోబర్ 31:

ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ తాగు నీటి ఏర్పాట్లకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లో గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాపై ఇంజినీర్లతో మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సింగూరు ప్రత్యామ్నాయ తాగు నీటి అవసరాలకు రూ.120 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ప్రత్యేక నిధులు విడుదల చేస్తామని మంత్రి సీతక్క చెప్పారు. ఇతర జిల్లాల్లో తక్షణ తాగు నీటి అవసరాల కోసం రూ. కోటి చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. అలాగే తాగు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. నీటి ఎద్దడి ప్రాంతాల్లో బోరు బావులను అద్దెకు తీసుకుని.. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరాకు ఏర్పాట్లు చేయాలని వారికి సూచించారు.చేతి పంపులు, బావులు, స్థానిక నీటి వనరులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఇంజనీర్లకు మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణపై కేటీఆర్ ప్రశ్నలు..

కేంద్రం పనితీరుపై ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 31:

ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణలో కేంద్రం పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బ్యాంక్ ప్రైవేటీకరణలో కేంద్రం పారదర్శకతను పాటించడం లేదని ఆరోపిం చారు.'ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు దేశ సంపద. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఐడీబీఐ బ్యాంక్ విలువను తక్కువగా అంచనా వేస్తున్నారన్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. బిడ్లు రిజర్వ్ ధర కంటే తక్కువగా వచ్చినప్పుడు నిబంధనలు, వాల్యుయేషన్ విధానాలను ఎందుకు మార్చారు? హైదరాబాద్‌లోని విలువైన భూములతో పాటు ఐడీబీఐకి ఉన్న కీలకమైన రియల్ ఎస్టేట్ ఆస్తుల విలువను పూర్తిస్థాయిలో లెక్కలోకి తీసుకున్నారా? ఐడీబీఐ ఉద్యోగులు లేవనెత్తుతున్న అభ్యంతరాలు, ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? గొప్ప పేరున్న ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేట్ సంస్థకు అప్పగించే ముందు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. పారదర్శకతను ఎందుకు పాటించడం లేదు? బ్యాంక్ ప్రైవేటీకరణలో ఇంత తొందర ఎందుకు?' అని కేటీఆర్ నిలదీశారు.



రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద నిర్మాణాల కూల్చివేత

- చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపిన అధికారులు
- 40 ఏళ్లుగా పన్నులు కడుతున్నామంటున్న యజమానులు
- అధికారుల చర్యలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

హైదరాబాద్:

హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న పెద్ద చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను 'హైడ్రా' అధికారులు కూల్చివేశారు. చెరువు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే చర్యల్లో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలుస్తోంది.ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న ఓ భారీ షెడ్డును అధికారులు తొలగించారు. అధికారుల చర్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని ఆస్తుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఏళ్లుగా తాము క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు తెలిపారు. గత మూడు రోజులుగా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు వివరించారు.ముందుగా చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని, ఆ తర్వాతే చట్టపరమైన తమ భూములపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలోనూ ఇదే చెరువు పరిధిలో కూల్చివేతలు చేపట్టి, కొంత భూమిని పునరుద్ధరణ పనుల కోసం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



ఏపీ వ్యాప్తంగా ప్రారంభమైన ఎన్నికల సామగ్రి పంపిణీ..

నేడు పోలింగ్



అమరావతి:

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రేపు జరగనున్న పోలింగ్ కోసం ఈ ఉదయం నుంచే ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా నియమించిన పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పంపిణీ కేంద్రాలకు చేరుకుని బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని అందుకుంటున్నారు.రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక, నగర పంచాయతీలతో సహా మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మొత్తం 6,669 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, 4,372 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు 36,351 మంది పోలీసు సిబ్బందితో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇందులో 671 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైన విగా, 1,233 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి అదనపు భద్రతను కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించాలని లేదా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటాం. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు.

చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలి.

- పోక్సో, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన
- దాదాపూర్ లో అవగాహన సదస్సులో న్యాయమూర్తి నాగుల శిల్ప.
- పిఎం శ్రీ పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు

దోమ, నవంబర్ 1 (తెలంగాణ డైలీ న్యూస్) :

వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామ పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ (పరిగి) ఆధ్వర్యంలో "సురక్షిత చిన్నతనం ప్రచారం" (సురక్షిత బచపన్ అభియాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ప్రాథమిక దివాణీ న్యాయమూర్తి నాగుల శిల్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (పోక్సో), బాల్య వివాహాల నిరోధక చట్టం, అంతర్జాల నేరాలు (సైబర్ నేరాలు), సామాజిక మాధ్యమాలు ఆన్‌లైన్ ఆటల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నతనంలో తెలిసి తెలియక చేసే పొరపాట్ల వల్ల వారి కుటుంబాలు ఎంతో క్షోభను అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. అలా కాకుండా విద్యార్థులు



బాల్యంలోనే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని అనుకున్న విజయాలను సాధించాలని సూచించారు.అలాగే పాఠశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ ఏ -1) పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు న్యాయమూర్తి నాగుల శిల్ప చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న పరిగి దివాణీ న్యాయమూర్తి నాగుల శిల్ప, సీనియర్ న్యాయవాది నరేంద్ర యాదవ్, న్యాయ సహాయ సలహాదారు (లీగల్ ఎయిడ్ కౌన్సిల్) గౌస్ పాషా, దోమ ఉప పరిశోధకులు (ఎస్.ఐ) వసంత్ జాదవ్, గ్రామ సర్పంచ్ కృష్ణవేణి, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు అనసూయలను ప్రధానోపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్‌నాథ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మొగులయ్య, ఉపాధ్యాయులు, న్యాయస్థాన సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవాబ్‌పేటను కరువు మండలంగా ప్రకటించాలి.

- విస్లావత్ చందర్ నాయక్



నవాబ్‌పేట, నవంబర్ 1 (తెలంగాణ డైలీ న్యూస్) :

మహబూబ్ నగర్ జిల్లాలోని అతిపెద్ద మండలమైన నవాబ్‌పేటను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు విస్లావత్ చందర్ నాయక్ డిమాండ్ చేశారు. మొదటి విడతలోనే కరువు మండలంగా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. మండలంలో 90 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారని చెప్పారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడం, నాణ్యమైన కరెంటు లేకపోవడంతో పంటల న్నీ ఎండిపోయి రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తాగునీటికి, పశువుల మేతకు కూడా కష్టాలు వస్తాయని తెలిపారు. ఇతర మండలాల్లో పరిశ్రమలు ఉన్నప్పటికీ, నవాబ్‌పేటలో ఎలాంటి పరిశ్రమలు లేకపోవడంతో ఉపాధి దొరకక యువత, రైతులు ముంబై, పూణే, హైదరాబాద్‌లకు వలస వెళ్తున్నారని చెప్పారు. స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) అనిరుధ్ రెడ్డి, అధికారులు స్పందించి ఎకరానికి 25 వేల రూపాయల కరువు భత్యం ఇవ్వాలని కోరారు. అలాగే ఉదండాపూర్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

పరిగిలో వైభవంగా సేవా సంకల్ప అభియాన్.

- విజేతలకు బహుమతుల ప్రధానం

పరిగి, నవంబర్ 01 (తెలంగాణ డైలీ న్యూస్):

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని సంకల్ప్ విద్యాపీఠం పాఠశాలలో 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం ఆయన 25 సంవత్సరాల ప్రజాసేవా సమర్పణను పురస్కరించుకొని ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, వక్తృత్వ నైపుణ్యాలు, దేశభక్తి, సేవాభావం సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం రోజున బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ జిల్లా కో-కన్వీనర్ అనూష బాబ్జి హాజరై విజేతులకు బహుమతులు అందజేశారు. పోటీలలో మొదటి బహుమతిని ఎమ్. శ్రేష్ట, రెండవ బహుమతిని పెద్దిరెడ్డి భావన, మూడవ బహుమతిని సాయి సహస్ర నాలుగవ బహుమతిని తేజస్విని గెలుపొందా రు. ఈ సంద ర్భంగా జిల్లా కో-కన్వీనర్ అనూష బాబ్జి మాట్లా డుతూ... చిన్నతనం నుంచే విద్యార్థులకు దేశభక్తి, సేవా భావం అలవరచడం అభినందనీ యమని, ఇటువంటి పోటీలు పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను బయటకు



తీసేందుకు ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప్ విద్యాపీఠం పాఠశాల ప్రిన్సిపల్ అశోక్ కుమార్, శివకుమార్, పరిగి పట్టణ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, బిజెపి టౌన్ ప్రెసిడెంట్ బాలకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు రామచందర్, రామచంద్రయ్య, నర్సింలు, నాగేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరువు పేరుతో నిత్యావసరాల ధరల బాదుడా?

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలి
- ధరల పెంపుతో సామాన్యులపై తీవ్ర ప్రభావం
- ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఏరన్ పల్లి శ్రీనివాస్

కొడంగల్, నవంబర్ 1 (తెలంగాణ డైలీ న్యూస్) :

ఎల్ నినో, కరువు నెపంతో నిత్యావసర సరుకుల ధరలను ఆకాశానికెత్తి పేద, మధ్యతరగతి ప్రజల పొట్ట కొడుతున్న దళారులు, వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఏరన్ పల్లి శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో డిమాండ్ చేశారు. దళారులు గిడ్డంగులు (గోదాములు), వ్యాపార కేంద్రాలలో అక్రమంగా ధాన్యం నిల్వ చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఏరన్ పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... మార్కెట్‌లో బియ్యం, జొన్నలు ఇతర నిత్యావసర సరుకులను దళారులు పెద్ద ఎత్తున నిల్వ చేసి ఒక్కసారిగా ధరలు పెంచుతున్నారని తెలిపారు. దీనివల్ల సగటు పేద,



మధ్యతరగతి కుటుంబాలు నిత్యావసరాలను కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, వెంటనే టాస్క్ ఫోర్స్ సిబ్బందితో అక్రమ నిల్వ గోదాములపై దాడులు చేయించి, బ్లాక్ మార్కెటింగ్ దళారీ వ్యవస్థను అరికట్టాలని సూచించారు. అప్పుడే మార్కెట్‌లో ధరలు అదుపులోకి వచ్చి సమతుల్యత ఏర్పడుతుందని గుర్తుచేశారు. నిన్నమొన్నటి వరకు పంటలు పుష్కలంగా పండినప్పటికీ, ఏడాది కూడా గడవకముందే కరువు పేరు చెప్పి ధరలు పెంచడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజలు ఆకలితో రోడ్లెక్కి తిరగబడే పరిస్థితిని ప్రభుత్వాలు తెచ్చుకోవద్దని, ప్రజాగ్రహానికి గురైతే ప్రభుత్వాలు కూడా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు ఆకలితో అలమటించకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలను తక్షణమే కట్టడి చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

కరెంటు లేదు.. యూరియా లేదు.. ఇదేనా మార్పు...

- కాంగ్రెస్ వచ్చే.. కరువు తెచ్చే....
- చేతకాని పాలనతో రైతులకు తప్పని తిప్పలు.
- అప్పుడు రైతే రాజు.. ఇప్పుడు రోడ్డున పడ్డ రైతు
- కాంగ్రెస్ పై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

మహమ్మదాబాద్, నవంబర్ 1 (తెలంగాణ డైలీ న్యూస్) :

కాంగ్రెస్ పాలన అంటేనే కరువుకు సంకేతమని పరిగి మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం మహమ్మదాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రైతుల పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. మహమ్మదాబాద్ మండలాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలో రైతులు అన్ని విధాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సకాలంలో సాగునీరు అందించడంలో, యూరియా సరఫరా చేయడంలో, రైతుబంధు జమ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకి ఎందుకింత చులకన భావమని, ఎందుకింత నిర్లక్ష్యమని ఆయన ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిసినా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం ఘోరమైన వైఫల్యమని మండిప



డ్డారు. పొలాల్లో పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధి చూస్తూ ఊరుకోవడం దారుణమని, రైతుల కష్టాలు ప్రజాప్రతినిధులకు కనిపించడం లేదా అని నిలదీశారు.కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందించి, సమయానికి ఎరువులు, యూరియా సరఫరా చేస్తూ రైతులను రాజులుగా చూసుకున్నామని మహేష్ రెడ్డి గుర్తుచేశారు. కానీ నేడు కాంగ్రెస్ హయాంలో విద్యుత్ కోతలు, నీటి ఎద్దడితో రైతులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మహమ్మదాబాద్‌ను వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించి, ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని, అలాగే 24 గంటల నాణ్యమైన విద్యుత్, సకాలంలో యూరియా, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల తరఫున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం...

- ఇద్దరు పిల్లలను ఉరివేసి.. తల్లి ఆత్మహత్య



దారూర్, నవంబర్ 1 (తెలంగాణ డైలీ న్యూస్) :

వికారాబాద్ జిల్లా దారూర్ మండలం చింతకుంట గ్రామంలో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన భూపతి రెడ్డి, ఆయన భార్య వాసవి కుటుంబంతో కలిసి వికారాబాద్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం నాటి సాయంత్రం వారు చింతకుంట గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో వాసవి తన ఇద్దరు చిన్నారులకు ఉరివేసి, అనంతరం ఆమె కూడా ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గత కొంతకాలంగా వాసవి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడమే ఈ ఘటనకు కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇంటి వద్ద చోటుచేసుకున్న ఈ విషాదకర సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

సర్పంచులకు సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ లేదా...

● ఎమ్మెల్యే డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలి:...

● సర్పంచుల సంఘం అధ్యక్షులు పొన్నేమోని మాణిక్యం

పరిగి, నవంబర్ 1 (తెలంగాణ డైలీ న్యూస్) :

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోరే స్వేచ్ఛ కూడా సర్పంచులకు లేదా? అని పరిగి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, మిట్ట కోడూరు సర్పంచ్ పొన్నేమోని మాణిక్యం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల సమస్యలపై నిలదీస్తే వాటికి సమాధానం చెప్పకుండా, ఎదురుదాడి చేయడం, సర్పంచులను టార్గెట్ చేయడం పరిపాటిగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేలా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సుమారు 50 లైన్లతో కూడిన ఈ వార్తను స్పష్టంగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో విడుదల చేయడం జరిగింది.

– రోడ్డు పనుల హామీలు.. ఆచరణలో శూన్యం

పరిగి పట్టణంలోని బీజాపూర్ హైవే నుండి లక్నాపూర్ ప్రాజెక్ట్ వరకు డబల్ రోడ్డు నిర్మిస్తామంటూ సుమారు రెండేళ్ల క్రితం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. కానీ, రెండేళ్లు గడుస్తున్నప్పటికీ రోడ్డు పనులు మాత్రం ఎక్కడి గొంగళి అక్కడే



అన్న చందంగా మారాయి. దీనితో విసిగిపోయిన ఆయా గ్రామాల ప్రజలు, మిట్ట కోడూరు సర్పంచ్ మాణిక్యం ఆధ్వర్యంలో రోడ్డు నిర్మించాలంటూ శాంతియుతంగా నిరసన తెలుపుతూ పరిగి వరకు పాదయాత్రగా వస్తుండగా, పోలీసులు వారిని అక్రమంగా అరెస్టు చేయించారు. ఈ హడావుడితో అదే రోజు రోడ్డు పనులు ప్రారంభించినప్పటికీ, కేవలం మూడు కిలోమీటర్ల మేర రోడ్డు తవ్వి కంకర వేసి వదిలేశారు. తదుపరి రోలింగ్ చేయకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలపాలవుతున్నారు.

– మండల పరిషత్ సమావేశంలో వాగ్వాదం

ఈ దుస్థితిపై శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్ మాణిక్యం అధికారికంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి సమాధానం చెప్పాల్సిన ఎమ్మెల్యే, సర్పంచ్‌పైనే ఉలటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నువ్వు కావాలనే రాజకీయాలు చేస్తున్నావు, రోడ్డు నిర్మాణానికి ఇంకా మూడు నెలల సమయం ఉంది, బ్యానర్లు కట్టుకొని రోడ్డుపై నిరసన చేస్తే పనులు వెంటనే జరిగిపోతాయా?" అంటూ సర్పంచ్‌నుద్దేశించి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని మాణిక్యం ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్పందిస్తూ... "పెళ్లయిన మూడు నెలలకే పిల్లలు పుట్టరన్న ఎమ్మెల్యేకు, రెండేళ్లు దాటినా రోడ్డు పనులు పూర్తి కాకపోతే ఏమనాలి?" అంటూ ఘాటుగా నిలదీశారు.

– ప్రజలను మోసం చేసేలా మాటలు

రోడ్డు నిర్మాణం ఆలస్యం అయితే దానికి గల కారణాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలి కానీ, గతంలో వెంటనే పనులు పూర్తి చేస్తామని చెప్పి, ఇంకా మూడు నెలల "సమయం ఉంది, సమయం ప్రకారమే కొనసాగుతుంది, ఎవరూ నాపై తప్పుడు ఆరోపణలు చేయవద్దు, నాలుగైదు సంవత్సరాలకైనా సరే రోడ్డు వేస్తాను, అప్పటివరకు నన్ను బదలాం చేయవద్దు" అని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన నిలదీశారు. నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులను, ఎమ్మెల్యేను ప్రశ్నించే హక్కు బాధ్యత సర్పంచులకు లేదా? అలాంటప్పుడు ప్రజా సమస్యలపై మాట్లాడే సర్పంచులు పదవులలో ఎందుకు ఉండాలని ఆయన నిలదీశారు. వీటన్ని ంటికీ ఎమ్మెల్యే నేరుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

– వ్యక్తిగత ప్రశంసలతో కాలయాపన

పరిగి మండలానికి సంబంధించి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు తమ గ్రామాల సమస్యలను సమావేశంలో ప్రస్తావిస్తే, ఆ సమస్యల పరిష్కారం గురించి మాట్లాడకుండా ఎమ్మెల్యే తన చదువు గురించి, గత 60 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ పాలించింది. కానీ ఇప్పుడే కొత్తగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందనట్టు ఎన్నడూ జరగని అభివృద్ధి ఇప్పుడు జరుగుతోందని చెప్పుకుంటూ తనని తానే పొగుడుకోవడం ఎంతవరకు సబబు అని మాణిక్యం ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశాలు అంటే ప్రభుత్వపరంగా గ్రామాల్లో ఇప్పటివరకు చేసిన పనులు, త్వరలో చేయబోయే అభివృద్ధి పనులపై నిర్మాణాత్మక చర్చ జరగాలని అభిప్రాయ పడ్డారు. కానీ, "సర్పంచులు నన్ను ఎవరూ ప్రశ్నించవద్దు, మీ సమస్యలు నాకు చెప్పవద్దు, చెప్పినా నేను పట్టించుకోను, నాకు నచ్చింది నేను మాట్లాడి వెళ్ళిపోతాను" అనే ధోరణిలో ఎమ్మెల్యే తీరు ఉందని ప్రతిపక్ష సర్పంచులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మాణిక్యం వెల్లడించారు. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

నేరాల నివారణకు 'కమ్యూనిటీ కనెక్ట్'

● తొలుత తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలు

● వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

వరంగల్, అక్టోబర్ 31

నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పోలీసులు నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి వివిధ నేరాలు, మోసాల నివారణపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళలు, చిన్నారుల భద్రత, ఆస్తి సంబంధిత నేరాలు, దృష్టి మరల్చి చేసే దొంగతనాలపై ప్రజలకు వివరించనున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను తెలియజేయనున్నారు. అపరిచితులకు బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని కమిషనర్ సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తొలుత వరంగల్ నగరంలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్యక్రమాన్ని అమలు చేసి, అనంతరం కమిషనరేట్‌లోని అన్ని పోలీస్ స్టేషన్లకు విస్తరిస్తామని తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల భాగస్వామ్యం, అప్రమత్తతతో నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



సింగూర్ నుంచి మంజీరాకు 0.15 టీఎంసీల నీటి విడుదల

దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



సంగారెడ్డి, అక్టోబర్ 31 : తాగునీటి అవసరాల నిమిత్తం పుల్కల్ మండలంలోని సింగూర్ ప్రాజెక్టు నుంచి మంజీరా బ్యారేజ్‌కు 0.15 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభమైందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.55 గంటలకు ప్రాజెక్టులోని 4, 6, 7వ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి, 11,310 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. మొత్తం 0.15 టీఎంసీల నీటిని మంజీరా బ్యారేజ్‌కు విడుదల చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. నీటి విడుదల నేపథ్యంలో ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, మత్స్యకారులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నదీ పరివాహక ప్రాంతంలోకి వెళ్లకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇందిరాగాంధీ, సర్దార్ పటేల్‌కు ఘన నివాళులు

● కాశిబుగ్గ, కొత్తవాడ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



వరంగల్, అక్టోబర్ 31

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి, దేశ తొలి ఉప ప్రధాని, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం కాశిబుగ్గ సెంటర్‌లో నివాళి కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ధూపం సంపత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందిరాగాంధీ విగ్రహానికి, సర్దార్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం 23వ డివిజన్ కొత్తవాడలో మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సారయ్య పాల్గొన్నారు. అక్కడి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు





నల్లగొండ రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బసవరాజ్ కుమార్ స్వామి, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శిరీష శ్రీమాన్, తత్తరి లక్ష్మణ్, దామెర సర్వేశం, జన్ను రవి, డీసీసీ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు వరుణ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు నారగోని మురళి గౌడ్, రామా యాదగిరి, కొమ్ముల సందీప్, మార్తా ఆంజనేయులు, వెల్దండి లక్ష్మణ్, జంజీరాల వేణు, రాముల బాబు, బైరబోయిన చంద్రమౌళి, కాశెట్టి వేణు, గుత్తికొండ తిరుపతి, బోలుగొడ్డు అనిల్, బత్తుల వినోద్, నరిగే శ్రీనివాస్, కూచన రవీందర్, సింగారపు చిరంజీవి, ఎస్‌కే ఇమ్రాన్, క్యాతం వేణు, వసుకుల ఉదయ్, ఈసంపల్లి ప్రభాకర్, సన్నీ పాల్గొన్నారు.

విశ్వశ్రీ రెసిడెన్సీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

●అధ్యక్షుడిగా విజయభాస్కరరెడ్డి.. ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి



అక్టోబర్ 31

విశ్వశ్రీ రెసిడెన్సీ ఓనర్స్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మావురపు విజయ భాస్కరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రుద్రోజు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల కుమారస్వామి, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ అహ్మద్, కోశాధికారిగా శ్రీరామోజు విద్యాసాగర్ ఎన్నికయ్యారు.



కార్యవర్గ సభ్యులుగా బి. లక్ష్మణ్, ఇంజనీర్ కంకల సదానందం, ఎం. నారాయణ, ఆడెపు నాగరాజు, ఎన్. దేవేందర్, కె. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, వి. సాయికుమార్, కానోజ్ వెంకటాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. నవంబర్‌లో అపార్ట్‌మెంట్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. యజమానులందరూ ప్రతి నెలా 10వ తేదీలోపు నిర్వహణ రుసుమును కోశాధికారికి చెల్లించాలని కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తక్కువగా ఉన్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించాలని నిర్ణయించారు. అపార్ట్‌మెంట్ అభివృద్ధికి యజమానులందరూ సహకరించాలని, సలహాలు, సూచనలు అందించాలని కోరారు. వాటిని పరిగణనలోకి తీసుకుని సమష్టిగా ముందుకు సాగుతామని తెలిపారు. గత కమిటీ అందించిన సేవలకు నూతన కమిటీ ధన్యవాదాలు తెలిపింది.

కాలనీ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి: కాలనీవాసులు

ఎమ్మెల్యే నాయిని వ్యాఖ్యలపై చెరబండరాజు నగర్ వాసుల అభ్యంతరం





హనుమకొండ, అక్టోబర్ 31

చెరబండరాజు నగర్ కాలనీ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కాలనీవాసులు సూచించారు. ఆయన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తాము 2003లో పట్టాలు పొంది, అప్పటి నుంచి కాలనీలో నివసిస్తున్నామని పేర్కొన్నారు. తమ హక్కుల పరిరక్షణ కోసం చట్టాన్ని ఆశ్రయించామని, న్యాయస్థానాల ద్వారా రక్షణ కోరుతున్నామని తెలిపారు. తమకు సంబంధించిన అంశాలపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మాదిగల పట్ల ఎమ్మెల్యే వివక్షతో వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపించారు. తమ నివాసాలు, హక్కుల జోలికి వస్తే చట్టబద్ధంగా పోరాడతామని స్పష్టం చేశారు. నిరుపేదలైన తమకు రక్షణ కల్పించి, హక్కులను గౌరవించాలని కోరారు.

రూ. 26 కోట్ల సైబర్ ఫ్రాడ్ కేసు.. హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

హైదరాబాద్ :హైదరాబాద్‌లో మూడు ప్రాంతాల్లో ఈడీ సోదాలు అల్లంరాజు సత్యనారాయణమూర్తి ఆస్తులే లక్ష్యంగా దాడులు భారీగా నగదు, రూ. 5 కోట్ల విలువైన స్థిరాస్తులు గుర్తింపు అధిక లాభాల ఆశ చూపి వెబ్‌సైట్ ద్వారా మోసం చేసినట్లు ఆరోపణలుసైబర్ మోసానికి సంబంధించిన భారీ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించింది. అల్లంరాజు సత్యనారాయణమూర్తికి చెందిన మూడు ప్రాంగణాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కేరళలోని ఎర్నాకుళం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్.ఐ.ఆర్ ఆధారంగా ఈడీ ఈ చర్యలు చేపట్టింది.కేసు వివరాల ప్రకారం.. నిమేష్ అనే వ్యక్తిని ఫోన్ కాల్స్, టెలిగ్రామ్ సందేశాల ద్వారా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సంప్రదించి, అధిక లాభాల పేరుతో ప్రలోభపెట్టారు. ఫుజూఖ్‌శ్రీఅఱ.ఎశీఏ అనే వెబ్‌సైట్‌లో పెట్టుబడులు పెడితే భారీ రాబడి లభిస్తుందని నమ్మించారు. వారి మాటలను విశ్వసించిన బాధితుడు, 2023 మే నుండి 2024 మే మధ్య కాలంలో సుమారు రూ. 26.02 కోట్లను నిందితులు సూచించిన వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశాడు. అయితే, పెట్టిన పెట్టుబడి గానీ, లాభాలు గానీ తిరిగి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.ఈ కేసును మనీలాండరింగ్ కోణంలో విచారించిన ఈడీ, బాధితుల నుండి అక్రమంగా సేకరించిన నిధులను నిందితులు బినామీ ఖాతాలు, వివిధ కంపెనీలకు మళ్లించినట్లు గుర్తించింది. బీటీఆర్ ఇండస్ట్రీస్, వెలుగు ట్రేడింగ్ కంపెనీ, ఆశ్రిత మెగా సొల్యూషన్స్, ఆశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వంటి సంస్థల పేర్లతో లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ నిధులతో హైదరాబాద్‌లో ఒక విల్లా ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించినట్లు ఈడీ విచారణలో వెల్లడైంది.తాజాగా నిర్వహించిన సోదాల్లో అధికారులు కీలక పత్రాలను, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును మనీలాండరింగ్ కోణంలో విచారించిన ఈడీ, బాధితుల నుండి అక్రమంగా సేకరించిన నిధులను నిందితులు బినామీ ఖాతాలు, వివిధ కంపెనీలకు మళ్లించినట్లు గుర్తించింది. బీటీఆర్ ఇండస్ట్రీస్, వెలుగు ట్రేడింగ్ కంపెనీ, ఆశ్రిత మెగా సొల్యూషన్స్, ఆశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వంటి సంస్థల పేర్లతో లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ నిధులతో హైదరాబాద్‌లో రూ. 6.40 లక్షల నగదును సీజ్ చేయడంతో పాటు, 11 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 14 లక్షల నగదును స్తంభింపజేశారు. వీటితో పాటు దాదాపు రూ. 5 కోట్ల విలువైన ప్లాట్లు, విల్లా వంటి స్థిరాస్తులను గుర్తించినట్లు ఈడీ తన అధికారిక ప్రకటనలో పేర్కొంది.

జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం విజయవంతం.. ఇస్రోకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



హైదరాబాద్, అక్టోబర్ 31: శుక్రవారం అర్ధరాత్రి 11.51 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని షార్ (శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్) నుంచి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. దీని ద్వారా అత్యాధునిక నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్-03 ని నింగిలోకి పంపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్రోను ప్రశంసిస్తూ.. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందికి అభినందనలు తెలిపారు.అత్యాధునిక నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్-03 ద్వారా భారత నావిగేషన్ సామర్థ్యాలకు మరింత బలం చేకూరుతుందని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్ రంగాలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. పర్యవేక్షణ, అత్యవసర సేవల్లోనూ కీలకంగా మారనుందని తెలిపారు. ఇస్రో విజయం యావత్ దేశానికి గర్వకారణమన్న సీఎం.. భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కండరాల క్షీణతతో బాధపడే చిన్నారులకు అండగా ఉంటాం

హైదరాబాద్, అక్టోబరు 31 : కండరాల క్షీణత, బలహీనత (మస్క్యులర్ డిస్ట్రోఫీ)తో బాధపడే చిన్నారులకు అండగా ఉంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ భరోసా కల్పించారు. మస్క్యులర్ డిస్ట్రోఫీని జెనెటిక్ టెస్టుల ద్వారానే అరికట్టగలమని వ్యాఖ్యానించారు. కండరాల క్షీణత వ్యాధిపైన దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడారు. చాలా ప్రాంతాల్లో కండరాల క్షీణతతో బాధపడుతున్న చిన్నారులను తాను చూశానని తెలిపారు. బాధిత పిల్లలకు భరత్ ఎండీ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా భరత్ ఎండీ ఫౌండేషన్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు.ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలి..మనలో ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. కండరాల క్షీణత అనేది చాలా తీవ్రమైన వ్యాధి అని చెప్పుకొచ్చారు. ఈ రోజుల్లో చాలామంది పిల్లలను కన్న తర్వాత చెత్తకుప్పల్లో పడేస్తున్నారని.. కానీ పిల్లలకు తీవ్రమైన వ్యాధి ఉన్నప్పటికీ, వాళ్లను అపురూపంగా చూసుకుంటున్నారని... అలాంటి తల్లిదండ్రులు చాలా గ్రేట్ అని అభినందించారు. ఈ వ్యాధి ఉన్న చిన్నారుల సింగిల్ పేరెంట్స్‌ను కూడా తాను చాలామందిని చూశానని అన్నారు. అలాంటి తల్లిదండ్రులకు తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు.



జీహెచ్ఎంసీ తీరుపై హైకోర్టు ఆగ్రహం.. కూల్చివేతలపై ప్రశ్నల వర్షం

హైదరాబాద్: నిర్మాణాలపై జీహెచ్ఎంసీ వైఖరిపై హైకోర్టు ఆగ్రహం అనుమతులిచ్చి, క్రమబద్ధీకరించి మీరే కూల్చేస్తారా? అని ప్రశ్న మల్కాజ్‌గిరి డిఫెన్స్ హౌసింగ్ సొసైటీ కేసులో తీవ్ర వ్యాఖ్యలు కౌంటర్లు దాఖలు చేసేందుకు జీహెచ్ఎంసీ, హైడ్రాకు తుది గడువు 'నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం మీరే చేసి, ఇప్పుడు మళ్లీ వాటిని కూల్చివేయమని అడగడమేంటి?' అంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భవన నిర్మాణ అనుమతులు, కూల్చివేతల విషయంలో జీహెచ్ఎంసీ వైరుధ్యపూరిత వైఖరిని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది.మల్కాజిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డిఫెన్స్ హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సొసైటీ పరిధిలోని ప్లాట్లలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలను సవాల్ చేస్తూ నర్సింహారెడ్డి తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, సొసైటీకి చెందిన 6,039 చదరపు గజాల స్థలంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ నిర్మించి, వాహనాలు పార్క్ చేస్తోందని సొసైటీ మరో పిటిషన్ వేసింది.జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్ ఈ కేసును విచారించారు. తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని, లేఅవుట్ కూడా క్రమబద్ధీకరించారని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, లేఅవుట్లను క్రమబద్ధీకరించిన తర్వాత, అందులోని ప్రజా వినియోగ స్థలాలను కాపాడాలని రెవెన్యూ, హైడ్రా శాఖలకు జీహెచ్ఎంసీ లేఖలు రాయడమేమిటని ప్రశ్నించారు. తమ సొంత స్థలంలోని నిర్మాణాలను తొలగించుకోకుండా, రెవెన్యూ శాఖను ఆశ్రయించాల్సిన అవసరం ఏమొచ్చిందని జీహెచ్ఎంసీని నిలదీశారు.ఈ నేపథ్యంలో, కౌంటర్లు దాఖలు చేసేందుకు జీహెచ్ఎంసీ, హైడ్రాలకు చివరి అవకాశంగా మూడు వారాల గడువు ఇస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.



తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మోడల్ పాఠశాలలు - రూ.787 కోట్లతో విద్యాశాఖ ప్రణాళిక

హైదరాబాద్ :తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లను సమూలంగా మార్చేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. అన్ని మోడల్ స్కూళ్లను తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు (టీపీఎస్?) గా మార్చే లక్ష్యంతో విద్యాశాఖ రూ.787 కోట్ల వ్యయంతో ప్రణాళికను రూపొందించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. దీనికి ఆమోదం లభిస్తే, వచ్చే విద్యా సంవత్సరం 2027-28 నుంచి ఈ మార్పులు అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు ఉన్నాయి. కొత్త ప్రణాళిక ప్రకారం 1 నుంచి 5వ తరగతులను కూడా చేర్చనున్నారు.ప్రాథమిక తరగతుల కోసం రూ.582 కోట్లురాష్ట్రంలో 2012-13 విద్యా సంవత్సరంలో 194 మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. ప్రాథమిక తరగతులను ప్రవేశపెట్టేందుకు ప్రతి పాఠశాలలో అదనంగా ప్రతి తరగతికి రెండు చొప్పున తరగతులు అవసరమవుతాయి. ఒక్కో పాఠశాలకు రూ.3 కోట్ల చొప్పున, మొత్తం రూ.582 కోట్లు ఖర్చవుతాయని విద్యాశాఖ అం చనా వేసింది. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం 'ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్' (ఏఐబీబీ) నుంచి విద్యాశాఖ కోసం తీసుకోనున్న రుణంలో కొంత భాగాన్ని ఉపయోగించాలని ప్రతిపాదించారు.అసంపూర్తి పనుల కోసం రూ.205 కోట్లు105 మోడల్ స్కూళ్లలో భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని లేదా ఇతర మరమ్మతులు అవసరమని విద్యాశాఖ గుర్తించింది. 38 చోట్ల నిర్మాణాలు పాక్షికంగా మాత్రమే పూర్తయ్యాయి. మరో 67 చోట్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. వీటితోపాటు కాంపౌండ్ వాల్‌ల నిర్మాణం, పాఠశాల ప్రాంగణాల అభివృద్ధి, క్రీడా మైదానాల ఏర్పాటు, బాస్కెట్‌బాల్ కోర్టుల నిర్మాణం వంటి వివిధ పనుల కోసం సుమారు రూ.205.54 కోట్లు అవసరమవుతాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ మొత్తం రూ.787.54 కోట్ల కోసం ప్రతిపాదనలను సమర్పించింది. ఇందులో ఏఐబీబీ రుణం నుంచి 70 శాతంకాగా, 30 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది.చేసింది.ప్రతి పాఠశాల వద్ద అదనంగా 300 సీట్లుప్రస్తుతం ఒక్కో పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 820 చొప్పున మొత్తం 1,59,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సుమారు 1,10,000 సీట్లు భర్తీ అయ్యాయి. దీనివల్ల మొత్తం 194 పాఠశాలల్లో 58,200 సీట్లు అదనంగా అందుబాటులోకి వస్తాయి. మోడల్ స్కూల్స్‌లో ఉపాధ్యాయులు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోనే బోధించడం ఒక ప్రత్యేకత. ఈ మార్పుల వల్ల ప్రాథమిక స్థాయి తరగతులకు మంచి స్పందన లభిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.



యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు విరాళాలు.. డీజీపీకి చెక్కుల అందజేత

హైదరాబాద్, అక్టోబరు 31 : యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.42.5 లక్షల సీఎస్ఆర్ నిధులు జమ అయ్యాయి. ఈ స్కూల్‌కు మూడు కార్పొరేట్ సంస్థల నుంచి రూ.42.5 లక్షల విరాళం అందాయి. కోహినూర్ గ్రూప్‌నకు చెందిన రూ.25 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు సంస్థ ప్రతినిధులు చెక్కును ఇచ్చారు.పుజోలానా మెషినరీ ఫ్యాబ్రికేషన్స్ ఎండీ ఆదిత్య పాయ్, ఆర్యన్ ప్రెసిషన్ సంస్థ తరపున రూ.10 లక్షల విరాళం అందజేశారు. దివ్యశక్తి గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్ రవీంద్ర కుమార్ అగర్వాల్ రూ.7.5 లక్షలు ఇచ్చారు. విద్యాభివృద్ధికి ముందుకొచ్చిన సంస్థల ప్రతినిధులను డీజీపీ ఆనంద్ అభినందించారు. పోలీసు సిబ్బంది పిల్లల విద్యాభివృద్ధికి ఈ నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. సమాజానికి పోలీసు సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఆయా సంస్థలు సహకారం అందిస్తున్నాయని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు



ప్రైవేట్ ఆసుపత్రులకు లబ్ధి చేకూరుస్తున్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31:



ఇప్పటికైనా జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సి. లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జడ్చర్లలో అంబేద్కర్ కళా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి బాగా లేదంటూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తద్వారా ప్రైవేట్ ఆస్పత్రులకు లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే వైఖరిని ఎండగట్టారు.వైద్యులు, సిబ్బంది ఉంటే ఆసుపత్రికి పేషంట్స్ వస్తారా? లేక పేషంట్స్ వస్తే వైద్యులు వస్తారా? అని ఎమ్మెల్యేను ఆయన ప్రశ్నించారు. జడ్చర్ల, మిడ్జిల్ మండలాల పరిధిలోని 50 గ్రామాల ప్రజలు ఈ ఆసుపత్రికి వస్తారని వివరించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిది బాధ్యతారాహిత్యం అని విమర్శించారు.జడ్చర్ల నియోజకవర్గంలో సమస్యల పరిష్కారాన్ని వదిలేసి ఎటువంటి రాజకీయాలు నడుస్తున్నాయో చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. హుందాగా రాజకీయాలు చేయాలని చాలా సార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేకు చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే సంస్కారం ఏమిటనేది ప్రజలంతా చూస్తున్నారని అన్నారు.జడ్చర్లకు మూడేళ్ల కిందట నీళ్లు వస్తే ఇప్పటికీ అదే వీడియో పెట్టి చూపిస్తున్నారంటూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యవహారశైలిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఎప్పుడూ నీళ్లు రాలేదని చెప్పారు. నీ స్వగ్రామంలోని అపైర్డ్‌ల్యాండ్‌ను డబుల్ బెడ్ రూం ఇళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించామని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గుర్తు చేశారు.

భర్త చనిపోతే భార్యకు పింఛను - దివ్యాంగ, గీత, డయాలసిస్ మొదలైన బాధితులకు భారీ ఊరట!

హైదరాబాద్ :తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్ల బదిలీ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పును తీసుకొచ్చింది. పింఛను పొందుతున్న వ్యక్తి మరణిస్తే, ఆ పింఛనును వారి జీవిత భాగస్వామి పేరుకు మార్చే ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో పింఛను పొందుతున్న భర్త మరణిస్తే ఆయన భార్యకు వితంతు పింఛను రావడానికి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. కార్యాలయాల చుట్టూ తిరగడం, అధికారుల పరిశీలన వంటి కారణాల వల్ల నెలల సమయం పట్టేది.ఇక నుంచి ఆ సమస్య లేకుండా ఆదేశాలు జారీచేసింది. ఇప్పటివరకు వృద్ధాప్య పింఛను పొందుతున్న భర్త మరణించిన సందర్భంలో అతని భార్యకు మాత్రమే పింఛను మంజూరు పొందే నిబంధన ఉండేది. దీనిని దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా పింఛనుదారులకు కూడా విస్తరించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.దివ్యాంగ, గీత, చేనేత, ఇతర వర్గాలలో పింఛను పొందుతూ తమ భర్తలను కోల్పోయిన మహిళలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారికి మద్దతుగా తక్షణ పింఛను సహాయం అందించాలని కోరుతూ సెర్ప్? సీఈఓ దివ్యా దేవరాజన్ ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని తక్షణమే ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.భర్త మృతి చెందిన తర్వాత భార్యకు పింఛనుదివ్యాంగ, గీత, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా వర్గాల కింద మరణించిన పింఛనుదారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే, వితంతు పింఛను ఇవ్వడం జరుగుతుంది. ఆమెకు 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉంటే వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తారు.ద్ద, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛనుదారుని ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు సమర్పించాలి. సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలిస్తారు. చేయూత పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి, అర్హతను నిర్ధరిస్తారు. ఆ తర్వాత పింఛను మంజూరు చేస్తారు.



జనరల్ న్యూస్

వరుసగా బెంచ్‌కే ఫిక్స్.. అంత నమ్మకం లేదా గంభీర్ జీ..!



టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జట్టు ఎంపికలో పలు మార్పులు కనిపిస్తున్నాయి. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడంతో పాటు జట్టు అవసరాలకు తగ్గట్టుగా ప్లేయింగ్ ఎలెవన్‌ను మార్చుతున్నారు. అయితే ఇదే సమయంలో అనుభవం ఉన్న కొంతమంది ఆటగాళ్లు మాత్రం బెంచ్‌కే పరిమితమవుతున్నారు. అందులో ఇప్పుడు కుల్దీప్ యాదవ్ (ఖబశ్రీఎవవజూ ్ఘఌజ) పేరు ప్రధానంగా వినిపిస్తోంది.భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లు పూర్తయ్యాయి. భారత్ సిరీస్‌ను సొంతం చేసుకున్నా.. ఈ నాలుగు మ్యాచ్‌ల్లోనూ కుల్దీప్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కలేద.మధ్య ఓవర్లలో వికెట్లు తీయగల సామర్థ్యం ఉన్న స్పిన్నర్‌గా కుల్దీప్‌కు మంచి గుర్తింపు ఉంది. బ్యాటర్లు దూకుడుగా ఆడే సమయంలో అతడి మణికట్టు స్పిన్‌తో వికెట్లు సాధించే సత్తా ఉంది. అయినా న్యూజిలాండ్‌తో సిరీస్‌లో అతడిని ఒక్కసారి కూడా బరిలోకి దించలేదు.ఇది కేవలం ఈ సిరీస్‌కే పరిమితం కాలేదు. గతంలోనూ కొన్ని సందర్భాల్లో కుల్దీప్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కకపోవడంపై చర్చ జరిగింది. ముఖ్యంగా జట్టులో బ్యాటింగ్ లోతును పెంచాలనే ఉద్దేశంతో అదనపు బ్యాటర్ లేదా ఆల్‌రౌండర్‌ను ఎంపిక చేసే సందర్భాల్లో స్పిన్నర్‌కు చోటు తగ్గుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి.వెస్టిండీస్ సిరీస్‌లో అదరగొట్టిన కుల్దీప్..ఇటీవల వెస్టిండీస్ (ఔవర్ ×అఒఅవం)తో జరిగిన టీ20, వన్డే సిరీస్‌లలో కుల్దీప్ యాదవ్ ప్రభావవంతమైన ప్రదర్శన చేశాడు. తన కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. అంతకుముందు ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడిన సమయంలోనూ యార్క్‌షైర్ ళశీతీఎంష్ట్రఅతీవ) తరపున కుల్దీప్ మంచి ప్రదర్శన చేసినట్లు రిపోర్టులు వచ్చాయి. దీంతో న్యూజిలాండ్ సిరీస్‌లో అతడికి అవకాశం వస్తుందని అభిమానులు భావించారు. కానీ నాలుగు మ్యాచ్‌లు ముగిసినా ఆ అవకాశం రాలేదు. అయితే జట్టు ఎంపికలో పిచ్ పరిస్థితులు, ప్రత్యర్థి బ్యాటింగ్ కూర్పు, బ్యాటింగ్ లోతు వంటి అంశాలను టీమ్ మేనేజ్‌మెంట్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి కుల్దీప్‌ను పక్కన పెట్టడం వెనుక కారణం గంభీర్ వ్యక్తిగత నిర్ణయమని చెప్పడానికి ఆధారాలు లేవు.అయినా "ఇంత మంచి స్పిన్నర్‌కు వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లోనూ అవకాశం ఎందుకు ఇవ్వలేదు?" అనే ప్రశ్న మాత్రం అభిమానుల్లో కొనసాగుతోంది. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో చివరి మ్యాచ్‌లోనైనా కుల్దీప్‌కు అవకాశం దక్కుతుందా? లేక మరోసారి బెంచ్‌పైనే కూర్చోవాల్సి వస్తుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

కుప్పకూలుతున్న పసిడి.. రూ.30 వేలు తగ్గిన వెండి ధర..!



: పండగ సీజన్‌లో వెండి ధరలు కుప్పకూలుతున్నాయి. ఒకప్పుడు రికార్డు స్థాయిలో అంటే రూ. 4 లక్షల వరకు వెళ్లిన ధరలు.. ఇప్పుడు సగం వరకు దిగి రావడం కొనుగోలుదారులకు భారీ ఊరటనేనని చెప్పాలి. శుక్రవారం కమోడిటీ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. వెండి ధర అకస్మాత్తుగా 10,000 రూపాయలకు పైగా పడిపోగా, బంగారం ధరలు కూడా 4,000 రూపాయలకు పైగా తగ్గాయి. బంగారం, వెండి ధరలలో ఈ గణనీయమైన తగ్గుదలకు లాభాల స్వీకరణే కారణమని భావిస్తున్నారు.రాత్రి 8 గంటలకు, వీజశలో డిసెంబర్ ఫ్యూచర్స్ వెండి ధర కిలోకు రూ. 10,000 (సుమారు 5 శాతం) తగ్గి రూ. 1.79 లక్షలకు పడిపోయింది. బంగారం ధరలు 3 శాతం లేదా రూ. 4,200 తగ్గి రూ. 1,38,250కి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు కూడా గణనీయంగా తగ్గాయి. బంగారం ధర 2.79 శాతం పడిపోయి ఔన్సుకు వి3,921.32కు చేరగా, వెండి ధర 5.12 శాతం పడిపోయి ఔన్సుకు వి49.70 వద్ద ట్రేడ్ అయింది .

అయితే దేశీయంగా వెండి ధరల విషయానికొస్తే.. ఈ నెల 10వ తేదీ కిలో వెండి రూ.2,40,000 వద్ద ఉండగా, తాజాగా అంటే అక్టోబర్ 30న రూ.2.10,000లకు పడిపోయింది. అంటే కేవలం ఇరవై రోజుల్లోనే ఏకంగా 30 వేల రూపాయల వరకు దిగి వచ్చింది.బంగారం, వెండి ధరలు ఎందుకు పడిపోయాయి?రాత్రికి రాత్రే బంగారం, వెండి ధరలు తీవ్రంగా పడిపోయాయి. ఈ తగ్గుదల గణనీయమైన లాభాల స్వీకరణను సూచిస్తుంది. అయితే, అంతకుముందు, అమెరికా జీడీపీ మరియు ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనాల కంటే మెరుగ్గా ఉండటం, బంగారం, వెండి ధరలపై గణనీయమైన ప్రభావాన్ని చూపి, వాటి తగ్గుదలకు దారితీసింది. బలమైన జీడీపీ గణాంకాలు, నిరంతర ద్రవ్యోల్బణం కారణంగా, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత కఠినతరం చేయవచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. అధిక వడ్డీ రేట్లు పెట్టుబడిదారులను బంగారం, వెండి నుండి ఇతర రంగాలలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తున్నాయి.

టీమిండియా ఎఫెక్ట్.. న్యూజిలాండ్ సంచలన నిర్ణయం..!



టీమిండియాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల ఽ20 సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు వరుస ఎదురుదెబ్బలు ఎదుర్కొంటుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై సిరీస్‌లో 0-2తో వెనుకబడిన కివీస్, మిగిలిన మ్యాచ్‌ల కోసం తమ పేస్ బౌలింగ్ విభాగంలో గణనీయమైన మార్పులు చేసుకుంది. బిజీ అంతర్జాతీయ షెడ్యూల్, ఆటగాళ్ల పని భారాన్ని దృష్టిలో ఉంచుకొని పలువురు స్టార్ ఫాస్ట్ బౌలర్లకు విశ్రాంతినిచ్చి, యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని న్యూజిలాండ్ బోర్డు నిర్ణయించింది.ఈ మార్పుల ప్రకారం, స్టార్ పేసర్ లాకీ ఫెర్గుసన్‌కు వెల్లింగ్టన్‌లో జరిగే మూడో ఽ20 మ్యాచ్‌కు విశ్రాంతినిచ్చారు. అలాగే, మరో ప్రధాన పేసర్ మ్యాట్ హెన్రీ చివరి మూడు ఽ20 మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్నాడు. రాబోయే వన్డే సిరీస్‌లకు సన్నద్ధం కావడానికి అతనికి విశ్రాంతి కల్పించినట్లు జట్టు యాజమాన్యం పేర్కొంది.వారి స్థానంలో, తొలి రెండు ఽ20 మ్యాచ్‌లకు దూరమైన కైల్ జేమ్సన్ మూడో మ్యాచ్ కోసం వెల్లింగ్టన్‌లో జట్టుతో కలవనున్నాడు. అలాగే, బ్లేయర్ టిక్నర్ కూడా న్యూజిలాండ్ జట్టులోకి వచ్చాడు. ఇక, నాలుగు, ఐదవ మ్యాచ్‌ల కోసం యువ ఆటగాడు జోష్ క్లార్క్సన్‌ను జట్టులోకి తీసుకుంది న్యూజిలాండ్ బోర్డు. ఈ మార్పులను న్యూజిలాండ్ ప్రధాన కోచ్ రాబర్ట్ వాల్టర్ అధికారికంగా వెల్లడించారు.మూడవ ఽ20 మ్యాచ్ ఈ నెల 27వ తేదీన వెల్లింగ్టన్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ ఇరు జట్లకు ఎంతో కీలకం. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిస్తే సిరీస్‌ను వశం చేసుకుంటుంది. సిరీస్ కోల్పోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో న్యూజిలాండ్ ఈ మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితుల్లో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి.

రూ.123కే జియో రీఛార్జ్‌ప్లాన్.. 28 రోజుల వ్యాలిడిటీ.. అన్‌లిమిటెడ్ కాల్స్!



మీరు ప్రతి నెలా మీ మొబైల్ రీఛార్జ్ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయకూడదనుకుంటే, రిలయన్స్ జియో రూ.123 ప్రీపెయిడ్ ప్లాన్ మీకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ప్లాన్ 28 రోజుల వ్యాలిడిటీతో కాలింగ్, డేటా, ఎమీ వంటి ప్రయోజనాలను అందిస్తుంది. కానీ రీఛార్జ్ చేసే ముందు, ఒక ముఖ్యమైన విషయం తెలుసుకోవడం ముఖ్యం. ఈ ప్లాన్ ప్రతి జియో యూజర్ కోసం కాదు. ఇది ప్రత్యేకంగా జియో ఫోన్ వినియోగదారులకు మాత్రమే అనుకూలంగా ఉంటుంది. మీ వద్ద జియో ఫీచర్ ఫోన్ ఉండి, తక్కువ ఖర్చుతో కాలింగ్ ఉపయోగించుకోవాలనుకుంటే ఈ ప్లాన్ అందిస్తుందో తెలుసుకుందాం.జియో రూ.123 ప్లాన్‌లో మీకు ఏమి లభిస్తుంది?ఈ రిలయన్స్ జియో ప్రీపెయిడ్ ప్లాన్ ధర రూ.123, దీనికి 28 రోజుల వ్యాలిడిటీ ఉంటుంది. అంటే, రీఛార్జ్ చేసిన తర్వాత మీరు సుమారు నాలుగు వారాల పాటు దీని ప్రయోజనాలను పొందవచ్చు. డేటా విషయానికి వస్తే.. ఈ ప్లాన్‌తో కంపెనీ రోజుకు 500వీదీ హై-స్పీడ్ డేటాను అందిస్తుంది. 28 రోజులకు మీకు మొత్తం 14+దీ డేటా లభిస్తుంది. మీరు తేలికపాటి ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేసినా, సందేశాలు పంపినా, లేదా అవసరమైనప్పుడు ఆన్‌లైన్ సేవలను ఉపయోగించినా ఈ డేటా ఉపయోగకరంగా ఉంటుంది.యితే రోజువారీ 500వీదీ డేటా పరిమితి అయిపోయిన తర్వాత, ఇంటర్నెట్ వేగం 64ఖఎజూంకి పడిపోతుంది. దీనివల్ల అధిక వేగవంతమైన ఇంటర్నెట్ అవసరమయ్యే పనులను చేయడం కష్టంగా ఉంటుంది. అపరిమిత కాల్స్, 300 ఎమీల ప్రయోజనం: ఈ ప్లాన్ కేవలం డేటాను మాత్రమే కాకుండా, కాల్స్, మెసేజింగ్‌ను కూడా అందిస్తుంది. వినియోగదారులు లోకల్, ూణ సంబర్లకు అపరిమితంగా కాల్స్ చేసుకోవచ్చు. అదనంగా, ఈ ప్లాన్ చెల్లుబాటు కాలంలో మొత్తం 300 ఎమీ మెసేజ్‌లు కూడా అందుబాటులో ఉంటాయి. అందుకే మీరు మీ ఫోన్‌ను ప్రధానంగా కాల్స్ చేయడానికి, ముఖ్యమైన మెసేజ్‌లు పంపడానికి ఉపయోగిస్తుంటే, ఈ ప్లాన్ మీకు ఉపయోగకరంగా ఉండవచ్చు. అయితే రీఛార్జ్ చేసే ముందు మీ సంబర్‌కు ఈ ప్లాన్ అందుబాటులో ఉందో లేదో, ప్రస్తుత నిబంధనలను తప్పకుండా తనిఖీ చేసుకోండి. జియోసావన్, జియోటీవీకి కూడా యాక్సెస్: కంపెనీ రూ.123 ప్లాన్‌తో పాటు మరో రెండు అదనపు ప్రయోజనాలను కూడా అందిస్తోంది. వీటిలో జియోసావన్, జియోటీవీకి యాక్సెస్ కూడా ఉంది. దీని ద్వారా వినియోగదారులు సంగీతం వినవచ్చు. అందుబాటులో ఉన్న టీవీ కంటెంట్‌ను చూడవచ్చు. అయితే, ఈ సేవల

4వ మ్యాచ్‌లో తేలిపోయిన బ్యాటర్లు.. చిత్తుగా ఓడిన భారత్..!



న్యూజిలాండ్ చేతిలో టీమ్ ఇండియా 87 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. కివీస్‌పై టీ20ఐలలో భారత్‌కు ఇదే అతిపెద్ద ఓటమి. 2019లో వెల్లింగ్టన్‌లో నమోదైన 80 పరుగులదే మునుపటి రికార్డు. శుక్రవారం ఆక్లాండ్‌లో 260 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 172 పరుగులకే ఆలౌట్ అయింది. ఏ బ్యాట్స్‌మెన్ కూడా అర్ధశతకం సాధించలేదు. తిలక్ వర్మ 35 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జాకబ్ డఫీ నాలుగు వికెట్లు పడగొట్టాడు.శుక్రవారం అంతకుముందు, న్యూజిలాండ్ తమ అత్యధిక టీ20ఐ స్కోరును నమోదు చేసింది. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్, 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ 49 బంతుల్లో 107 పరుగులు చేయగా, మైఖేల్ కూడా 25 బంతుల్లో 65 పరుగులు చేశాడు.

ఈఎంఐలు చెల్లించేవారికి బ్యాడ్ న్యూస్.. ఆర్బీఐ మరో కీలక నిర్ణయం.



లోన్లు తీసుకున్నవారికి ఆర్బీఐ మరో షాక్ ఇవ్వనుందా..? త్వరలో ఆర్బీఐ మరోసారి వడ్డీ రేట్లను పెంచనుందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ద్రవ్య విధాన పరపతి సమావేశాల్లో ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. అయితే ఫిబ్రవరి 2027 నాటికి వడ్డీ రేట్లను మరింత పెంచే అవకాశముందనే అంచనాలు వెలువడుతున్నాయి. దీనికి కారణాలు ఏంటో చూద్దాం.వచ్చే ఏడాది 2027 ఫిబ్రవరి నాటికి ఆర్బీఐ రెపో రేటును మరో 50 బేసిస్ పాయింట్ల మేర పెంచే అవకాశముందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అంచనా వేసింది. ఈ మేరకు తాజాగా ఒక రిపోర్ట్ విడుదల చేసింది. ఈ నివేదికలో ఆ అంశాన్ని పొందుపర్చింది. దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న క్రమంలో వడ్డీ రేట్లు పెంచక తప్పని పరిస్థితి నెలకొందని నివేదికలో పేర్కొంది.ఆర్బీఐ అక్టోబర్‌లో జరిగిన సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో 5.25 శాతం నుంచి 5.50 శాతానికి వడ్డీ రేట్లు చేరుకున్నాయి. దీని వల్ల బ్యాంకులు ఇటీవల వడ్డీ రేట్లను పెంచాయి. దీంతో లోన్లు చెల్లించేవారికి నెలవారీ ఈఎంఐలు పెరిగాయి. కొత్తగా లోన్ తీసుకునేవారికి కూడా అధిక వడ్డీ రేట్లు పడుతున్నాయి. ఇది సామాన్యులపై భారాన్ని మోపుతోంది.ప్రస్తుతం దేశంలో దిగుమతి వ్యయాలు పెరగడంతో పాటు ప్రపంచ ఆర్థిక పరిణామాల క్రమంలో దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచాల్సిన బాధ్యత ఆర్బీఐపై ఉంటుంది. దీంతో ద్రవ్యలోటును నియంత్రించేందుకు, ధరల స్థిరత్వాన్ని ప్రోత్సహించేందుకు రాబోయే ద్రవ్య పరపతి విధాన సమీక్షలో కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేయనుంది. ద్రవ్యల్బణాన్ని తగ్గించేందుకు కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.



రుద్రవనం వెబ్ సిరీస్ రివ్యూ?

తెలుగులో ఒరిజినల్ వెబ్ సిరీస్‌ల జోరు ఇప్పుడు బాగా పెరిగింది. అదే కోవలో వచ్చిన మరో క్రైమ్ థ్రిల్లర్ రుద్రవనం.్లూ. నరేష్ అగస్త్య నటించిన ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. మరి ఈ సిరీస్ ఎలా ఉంది.. మెప్పించిందా లేదా అనేది పూర్తి రివ్యూలో చూద్దాం.. రుద్రవనం అనే ఒక మారుమూల ఊరిలో ఉన్న పోలీసుల కేంద్రం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే పోలీస్ అధికారి (నరేష్ అగస్త్య), తన పై అధికారితో (బెనర్జీ) కలిసి విధుల్లో ఉంటాడు.తెలుగులో ఒరిజినల్ వెబ్ సిరీస్‌ల జోరు ఇప్పుడు బాగా పెరిగింది. అదే కోవలో వచ్చిన మరో క్రైమ్ థ్రిల్లర్ రుద్రవనం.్లూ. నరేష్ అగస్త్య నటించిన ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. మరి ఈ సిరీస్ ఎలా ఉంది.. మెప్పించిందా లేదా అనేది పూర్తి రివ్యూలో చూద్దాం..కథరుద్రవనం అనే ఒక మారుమూల ఊరిలో ఉన్న పోలీసుల కేంద్రం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే పోలీస్ అధికారి (నరేష్ అగస్త్య), తన పై అధికారితో (బెనర్జీ) కలిసి విధుల్లో ఉంటాడు. తను సెలవు మీద వెళ్లాలి అనుకునే ముందు రోజు ఊహించని విధంగా ఒక గుర్తుతెలియని శవం దొరుకుతుంది. దానికి తోడు స్థానిక రాజకీయ నాయకుడి (రాజా రవీంద్ర) సోదరుడు కనిపించకుండా పోతాడు. ఈ రెండు వ్యవహారాలు పోలీసులకు పెద్ద సవాలుగా మారుతాయి. ఇంతలో దొరికిన ఆ శవం మొండెం నుంచి తలకాయ అదృశ్యం అవుతుంది. అసలు ఆ శవం ఎవరిది? నాయకుడి తమ్ముడు ఏమయ్యాడు? ఈ చిక్కుముడులను ఆ అధికారి ఎలా విప్పాడు? అన్నదే ఈ సిస్ సారాంశం.

కథనం:క్రైమ్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో సాగే వెబ్ సిరీస్‌లను తెరకెక్కించేటప్పుడు ప్రేక్షకుడికి ఎక్కడా విసుగు రాకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. ఈ విషయంలో దర్శకుడు చాలా తెలివిగా వ్యవహరించాడు. సుదీర్ఘమైన ఎపిసోడ్స్ పెట్టి సాగదీయకుండా, చాలా తక్కువ నిడివితో విషయాన్ని సూటిగా చెప్పే ప్రయత్నం చేయడం ఈ ప్రాజెక్టుకు అతిపెద్ద బలం. మొత్తం 7 భాగాలుగా రూపొందిన ఈ సిరీస్‌లో, ప్రారంభం నుంచి 5వ భాగం వరకు చాలా ఉత్కంఠభరితంగా సాగుతుంది. నేర విచారణ తీరు, మధ్యలో వచ్చే ఊహించని మలుపులు చూసేవారిని కట్టిపడేస్తాయి. ప్రారంభంలో వచ్చే కుటుంబ అనుబంధాల సన్నివేశాలు కూడా చాలా సహజంగా అనిపిస్తాయి. కానీ విచారణ ఎంత ఆసక్తికరంగా సాగిందో, ముగింపు కూడా అంతే బలంగా ఉండాలి. అక్కడే ఈ సిరీస్ కాస్త తడబడింది. 6వ ఎపిసోడ్ నుంచి కాస్త నెమ్మదిస్తుంది అలాగని పూర్తిగా ట్రాక్ తప్పదు. అప్పటివరకు ఒక అద్భుతమైన సస్పెన్స్ డ్రామా చూస్తున్నామన్న భావన కాస్తా, వీక్ రైటింగ్ వల్ల కాస్త తగ్గుతుంది. ఒక ముఖ్యమైన పాత్రను మరీ అతిగా, వినయంతో చూపించడంతో జరగబోయేది ఏంటో ప్రేక్షకుడికి ముందే అర్థమైపోతుంది. దాని వెనుక ఉన్న ఫ్లాష్‌బ్యాక్ కూడా అంతగా రుచించదు. అలాగే భార్యకు సంబంధించిన ట్రాక్ కూడా కథకు అనవసరంగా అతికించినట్లు అనిపిస్తుంది. ముగింపులో బలమైన ఎమోషన్స్ ఉండి ఉంటే ఈ సిరీస్ స్థాయి మరోలా ఉండేది. ఊహకు అందే ముగింపు కూడా ఉంటుంది.. అయినా కూడా వీకెండ్‌కు డీసెంట్ క్రైమ్ థ్రిల్లర్ చూడాలనుకునేవాళ్లకు రుద్రవనం పిఎస్ మంచి ఛాయిసే.నటీనటులు:పోలీస్ అధికారి పాత్రలో నరేష్ అగస్త్య చాలా సహజమైన నటన కనబరిచాతెలుగులో ఒరిజినల్ వెబ్ సిరీస్‌ల జోరు ఇప్పుడు బాగా పెరిగింది. అదే కోవలో వచ్చిన మరో క్రైమ్ థ్రిల్లర్ రుద్రవనం.్లూ. నరేష్ అగస్త్య నటించిన ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. మరి ఈ సిరీస్ ఎలా ఉంది.. మెప్పించిందా లేదా అనేది పూర్తి రివ్యూలో చూద్దాం.. రుద్రవనం అనే ఒక మారుమూల ఊరిలో ఉన్న పోలీసుల కేంద్రం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే పోలీస్ అధికారి (నరేష్ అగస్త్య), తన పై అధికారితో (బెనర్జీ) కలిసి విధుల్లో ఉంటాడు.డు. బాధ్యత గల అధికారిగా అతని హావభావాలు అందరినీ మెప్పిస్తాయి. పై అధికారిగా సీనియర్ నటుడు బెనర్జీ, పొలిటికల్ లీడర్‌గా రాజా రవీంద్ర తమ అనుభవంతో పాత్రలకు ప్రాణం పోశారు. చారు వాకన్‌తో పాటు మిగిలిన నటీనటులు అంతా తమకు ఇచ్చిన క్యారెక్టర్ల పరిధి మేరకు చక్కగా నటించి మెప్పించారు.టెక్నికల్ టీం:నిర్మాణ విలువలు ఈ తరహా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డ్రామాకు సరిపోయేలా ఉన్నాయి. పవన్ సమకూర్చిన నేపథ్య సంగీతం సన్నివేశాలలోని ఇంటెన్స్‌ను, టెన్షన్‌ను అమాంతం పెంచేసాయి. అక్షర్ అలీ కెమెరా పనితనం ప్రతి ఫ్రేమ్‌ను చాలా రిచ్‌గా చూపించింది. మాధవ్ ఎడిటింగ్ షార్ట్ అండ్ స్వీట్‌గా ఉండి బాగా ప్లస్ అయింది. దర్శకుడు శశిధర్ మున్నంగి హీరో, విలన్ ట్రాక్స్‌ను సమాంతరంగా నడిపిన తీరు బాగుంది కానీ, చివరి ఎపిసోడ్స్



అనిరుధ్ రవిచందర్, కావ్య మారన్ పెళ్లి వేడుక

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ పెళ్లి వార్తలు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి. ఈ నేపథ్యంలో వీరి వెడ్డింగ్ రిసెప్షన్‌కు సంబంధించిన వార్తలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. నవంబర్ 21న చెన్నైలో జరగనున్న ఈ రిసెప్షన్‌కు దేశంలోని పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సూపర్ స్టార్ రజినీకాంత్, అజిత్ కుమార్ వంటి ప్రముఖుల పేర్లు అతిథుల లిస్ట్‌లో వినిపిస్తున్నాయి. వీరి వివాహ వేడుకల సందర్భంగా నవంబర్ 21న చెన్నైలో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. ఈ వేడుకకు రాజకీయ, సినీ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ రిసెప్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కావ్య మారన్ తండ్రి, సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్, ఆయన భార్య కావేరి మారన్ స్వయంగా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులను కలిసి పెళ్లి రిసెప్షన్‌కు ఆహ్వానాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా కలిసి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలకు కూడా ఆహ్వానాలు అందించారు. ఢిల్లీలో సోనియా గాంధీని కళానిధి మారన్, కావేరి మారన్ కలిసి ఆహ్వానించారు.అలాగే సూపర్ స్టార్ రజినీకాంత్ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. అనిరుధ్‌కు రజినీకాంత్ దగ్గరి బంధువు కూడా.. రజినీకాంత్ నటించిన పలు సినిమాలకు అనిరుధ్ సంగీతం అందించారు. ముఖ్యంగా వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పాటలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్, ఆయన భార్య శాలిని అజిత్ కుమార్‌లను కూడా ఈ రిసెప్షన్‌కు ఆహ్వానించినట్లు తెలుస్తోంది. వీరితో పాటు తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేయనున్నట్లు సమాచారం. లోకనాయకుడు కమల్ హాసన్, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ పేర్లు కూడా అతిథుల జాబితాలో వినిపిస్తున్నాయి.వీరితో పాటు నటుడు ధనుష్, శివకార్తికేన్, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ వంటి ప్రముఖులకు కూడా ఆహ్వానాలు అందినట్లు తెలుస్తుంది. టాలీవుడ్ నుంచి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ఆయన భార్య స్నేహా రెడ్డి ఈ వేడుకకు ఆహ్వానించారని తెలుస్తుంది. దక్షిణాది చిత్ర



ఏం సినిమా రా నాయనా.100 కోట్లతో బాక్సాఫీస్ సెన్సేషన్.

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పెద్ద హీరోల సినిమాలు, వందల కోట్ల భారీ బడ్జెట్ చిత్రాలు మాత్రమే రికార్డులు సృష్టిస్తాయనే అపోహను ఎప్పుడూ కొన్ని చిన్న సినిమాలు పటాపంచలు చేస్తుంటాయి. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు చిన్న సినిమా పెద్ద సినిమా అనే తేడా చూడకుండా బ్రహ్మరథం పడతారు అనడానికి కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన ఒక సరికొత్త చిత్రం అద్దం పడుతోంది. ఎటువంటి భారీ అంచనాలు లేకుండా, కేవలం రూ. 2.5 కోట్ల ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఈ స్థాయికి చేరుకోవడం అంత సులభంగా జరగలేదు. సినిమా నిర్మాణం సమయంలో దర్శకుడు, నిర్మాతలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆర్థిక ఇబ్బందులు తారస్థాయికి చేరినప్పుడు సినిమా పూర్తి చేయడం కోసమే ఏకంగా కుటుంబ సభ్యుల ఆభరణాలను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక విడుదలకు ముందు థియేటర్లు దొరక్క, పెద్దగా ప్రమోషన్స్ చేయడానికి కూడా బడ్జెట్ లేక మేకర్స్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఈ స్థాయికి చేరుకోవడం అంత సులభంగా జరగలేదు. సినిమా నిర్మాణం సమయంలో దర్శకుడు, నిర్మాతలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆర్థిక ఇబ్బందులు తారస్థాయికి చేరినప్పుడు సినిమా పూర్తి చేయడం కోసమే ఏకంగా కుటుంబ సభ్యుల ఆభరణాలను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక విడుదలకు ముందు థియేటర్లు దొరక్క, పెద్దగా ప్రమోషన్స్ చేయడానికి కూడా బడ్జెట్ లేక మేకర్స్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.తొలి రోజు కేవలం కొన్ని థియేటర్లలోనే విడుదలైన ఈ చిత్రం, ప్రేక్షకులకు రీచ్ కావడం కోసం వినూత్న రీతిలో వివాహ ఆహ్వాన పత్రికల మాదిరిగా కరపత్రాలు పంచుతూ ప్రజలను సినిమా చూడమని కోరాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే సినిమా విడుదలైన మొదటి ఆట నుంచే మౌత్ టాక్ అద్భుతంగా పనిచేసింది. ప్రేక్షకులు సినిమాకు బ్రహ్మరథం పట్టడంతో క్రమక్రమంగా షోల సంఖ్య పెరుగుతూ వచ్చింది. చిన్న సినిమాగా వచ్చి ఊహించని విధంగా కలెక్షన్ల సునామీ సృష్టించిన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 100 కోట్లకు పైగా ప్రపంచవ్యాప్త వసూళ్లను సాధించి అందరినీ విస్మయానికి గురిచేసింది.

జయలలిత పాత్రలో త్రిష..



సౌతిండియన్ బ్యూటీ త్రిష కృష్ణన్ వెండితెరపై కనిపించి చాలా రోజులు అవుతోంది. అయితే ఇటీవలి కాలంలో ఆమె సినిమాల గురించికాకుండా ఇతర విషయాలతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. ముఖ్యంగా సీఎం విజయ్ తో త్రిష ప్రేమలో ఉన్నారని, పెళ్లి కూడా చేసుకుంటారన్న వార్తలు ఆ మధ్యన హాట్ టాపిక్ గా మారాయి. ఈ సంగతి పక్కన పెడితే.. ఇప్పుడు త్రిష పేరు మరోసారి మార్మోగుతోంది. అదేంటంటే. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నటుడు ఎం.జి. రామచంద్రన్ జీవితం ఆధారంగా ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ బయోపిక్‌లో, మాజీ ముఖ్యమంత్రి జయలలిత పాత్రను త్రిష పోషించనున్నారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. 'పురచీ తలైవర్ ఎంజీఆర్' అనే పేరుతో తెరకెక్కుతున్న ఈ బయోపిక్‌లో ఎంజీఆర్ సినీ జీవితం, అలాగే రాజకీయ జీవితంలోనూ ఆయన ఎదుర్కొన్న ఆటు పోట్లను చూపించనున్నారు. కాగా ఎంజీఆర్ వ్యక్తిగత, రాజకీయ జీవితంలో జయలలితది కీలక పాత్ర. ఆమె కూడా వెండితెరపైనా ఆపై రాజకీయ రంగంలోనూ సత్తా చాటారు. దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన నాయకురాలిగా ఎదిగారు. ఈ క్రమంలో సవాళ్లతో కూడిన ఈ పాత్ర కోసం త్రిషను ఎంపిక చేసేందుకు చిత్ర బృందం చర్చలు జరుపుతోందని అంటున్నారు.ఈ బయోపిక్‌లో ఎంజీఆర్, జయలలిత మాత్రమే కాకుండా, సి.ఎన్. అన్నదురై, ఎం. కరుణానిధి వంటి తమిళనాడు రాజకీయాల్లోని ప్రముఖులు కూడా కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఎంజీఆర్ పాత్రను జె.ఎం. బషీర్ పోషిస్తున్నారు. చెన్నైలోని రామపురంలో త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. త్రిష జయలలిత పాత్రను అంగీకరిస్తే, సినిమాపై అంచనాలు రెట్టింపు అవుతాయనడంలో సందేహం లేదు. అయితే, ఈ నటీనటుల ఎంపికకు సంబంధించి చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన ఏదీ రాలేదు. చర్చలు తుది దశలో ఉన్నాయి,



వాటితో నాకు ఎలాంటి సంబంధం లేదు.

సెలబ్రిటీల పేరిట సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు, నకిలీ ప్రచారాలు నడవడం ప్రస్తుతం సర్వసాధారణమైపోయింది. ముఖ్యంగా స్టార్ హీరోలు లేదా ప్రముఖుల వారసులు సినిమా రంగంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఇలాంటి వదంతులు మరింత ఎక్కువగా వస్తుంటాయి. తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ కుమారుడు, యువ దర్శకుడు జాసన్ సంజయ్ తన పేరుతో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. తన పేరుతో ఎలాంటి అధికారిక అభిమాన సంఘాలు లేదా సోషల్ మీడియా పేజీలను ప్రారంభించలేదని ఆయన స్పష్టం చేశారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా స్పష్టతనిచ్చిన జాసన్ సంజయ్.. సోషల్ మీడియాలో చలామణి అవుతున్న నకిలీ ఖాతాలను ఎవరూ నమ్మవద్దని కోరారు. తన పేరు లేదా ఫొటోలతో ఉన్న ఫేక్ అకౌంట్ల నుంచి వచ్చే పోస్టులు, కామెంట్లతో తనకెలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. అభిమానులు ఎవరూ అలాంటి నకిలీ సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని, ఎవరైనా తన పేరుతో కొత్తగా అధికారిక ఫ్యాన్ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు ప్రచారం చేస్తే వాటిని విశ్వసించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.కాగా, జాసన్ సంజయ్ కేవలం నటుడి కుమారుడిగా మాత్రమే కాకుండా, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు



ఈ వారం కూడా వర్షిణీ సేఫ్.. మరి బిగ్‌బాస్ 10 నుంచి ఎలిమినేట్ అయ్యేది ఎవరో తెలుసా?

ఎవరూ ఊహించని ట్విస్టులతో బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే ఈ రియాలిటీ షో దిగ్విజయంగా ఏడు వారాలు పూర్తి చేసుకుంది. ఎనిమిదో వారం కూడా వీకెండ్ కి చేరుకుంది. మరి ఈ వీకెండ్ లో భాగంగా ఎవరు ఎలిమినేట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది. దీనికి తోడు ఈ వారం కూడా డబుల్ ఎలిమినేషన్ అని ప్రచారం జరుగుతోంది. దీంతో కంటెస్టెంట్లలో దడ మొదలైంది. ఈ వారం నామినేషన్లలో రోహిత్, వంశీ, రామ్ ప్రసాద్, ఝాన్సీ, శివ, రామకృష్ణ, యాంకర్ వర్షిణి,సుధీర్ ఉన్నారు. మొత్తం ఎనిమిది మంది ఎలిమినేషన్ ముప్పును ఎదుర్కొంటుండటంతో ఈ వారం ఎవరు బయటకు వస్తారన్నది ఆసక్తికరంగా మారింది. అయితే వీరిలో యాంకర్ వర్షిణీ ఈ వారం కూడా సేఫ్ జోన్ లోకి వెళ్లిపోయిందని సమాచారం. నిజానికి బిగ్ బాస్ హౌస్ లో ఆమె నుంచి పెద్దగా పెర్ఫామెన్స్ లేదు. టాస్కులు కూడా పెద్దగా ఆడడం లేదు. అయినా ప్రతి వారం ఈ యాంకరమ్మను బిగ్ బాస్ సేఫ్ చేస్తున్నాడు అంటూ రూమర్లు వినిపిస్తున్నాయి. ఇక ఈ వారం కూడా నామినేషన్స్ లో ఉన్నప్పటికీ వర్షిణీ ఎలిమినేషన్ నుంచి దాదాపు బయటపడిందనే తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే.. 'ది అల్టిమేట్ గోట్' థీమ్ లో భాగంగా హౌస్‌లో బీబీ హోటల్ టాస్క్ జరిగింది. ఈ టాస్క్‌లో భాగంగా కంటెస్టెంట్లను రెడ్, ఎల్లో, గ్రీన్ జోన్లుగా

Edited,Printed,Published and Owend by CHITELA KRISHANA ,Printed at sravanthi prienters , rtc crss road ,Hyderabad-500001. Published at:4-80/1, VIKARABAD, Telangana.